# తప్పుకునే ఉపాయం

రచన
... ఉంగరాల సత్యవతి ...

మధురమధురమైన ఊహలు మగవారికీ కలుగుతాయి, ఆడువారికీ కలుగుతాయి. ఇందులో ఆనాదినుంచీ వైవిధ్యానికి తావులేదు.

జీవనవసంతప్రాయంలో తావిలేని కుసుమంకూడా ప్రకృతి ఉజ్వల సౌభాగ్యానికి తానుకూడ ఒక భాగస్వామిని కావాలని ప్రయత్నించటంలో నేరమేముంది? అది కేవలం రేఖల సౌభాగ్యమే కావచ్చు. అందుకని రంగుల మాధుర్యాన్ని నిరసించటం న్యాయమేనా? ముగ్ధలో అనుభవంలేని అతిలోకులమైన శృంగారజ్యోత్స్న లేకపోయినట్లైతే రససిద్ధికి రాణీవాసం చేసేవాళ్ళే దొరుకుతారు. కాళిదాసు కావ్యాలను ఈరీతి ఆత్మగా శోభించనట్లైతే అతని కావ్యాలు విశ్వాత్మకంగా అంగీకరింపబడేవేకావు. ఈ మాటలు సరోజ హృదయంలో సురదీర్ఘ కాపవనాల్లా మృదులసవ్వడి చేసినయ్. ప్రొద్దుట మొందటి పీరియడ్ లో కాళిదాసు శకుంతలాన్ని గూర్చి అంతిమ ఆలాపనచేస్తూ పంతులమ్మగారు సెలవిచ్చిన మధురవాక్కులివి. అవును. తన్మయతను కలిగించే అతిలోక కావ్య సంపదను కవులే సృష్టించగలరు. కాళిదాసును పండితుడనటంకంటె కవి అనటమే బావుంటుంది. శకుంతలలాంటి అపూర్వమయిన పాత్రను సృష్టించి ప్రకృతికి ఒకవిధంగా నిర్వచనాన్ని ఇచ్చివేశాడు. సరోజకు అనివార్యంగా నవ్వువచ్చింది. పంతులమ్మగారు చివరిసారి శ్లేషించి అన్నమాటలు ఆమెచెవుల్లో గింగురుమన్నాయి. "మీరంతా ఇప్పుడు ఆశ్రమంలో పెరుగుతోన్న శకుంతలలాంటివాళ్ళు. ఈనాటి ఆధునిక దుష్యంతుల విషయంలో విజ్ఞతనుచూపి హృదయకవాటాన్ని తెరవటం మంచిది." ఏమిటో! పంతులమ్మగారు జీవితంలో దెబ్బతిన్నట్టుగా మాట్లాడింది. ఆమె స్వరంలోని ఆవేదన ఈ సత్యాన్ని మరుగుపరచలేకపోయింది. సరోజకు పంతులమ్మగారిమీద వెర్రి అభిమానం కలిగింది. నిజమే... ఆధునిక దుష్యంతుల విషయంలో ఏమరి వుండకూడదు.

సరోజ సందుమలుపు తిరుగుతోంది. తన వెనుక సైకిల్ బెల్ వినిపించింది. కొంచెం ప్రక్కకు తప్పుకుని నడుస్తోంది. ఎంతకీ ఆ సైకిల్ తన్ను దాటిపోవటంలేదు. అయినా వెనుతిరిగి చూట్టానికి ఆమెకు మనస్కరించలేదు. ఇంతలో "మీపేరు తెలుసుకోవచ్చా?" వెనుకనుంచి వినిపించింది. సరోజ వెనుతిరిగిచూసింది. అమ్మో, దుష్యంతుడు! బాణాలు, కిరీటం లేవు. చిన్నషర్టు, ఉలెన్ పేంటు తొడుక్కొనివున్నాడు. సరోజ వచ్చే నవ్వుని బలవంతంగా ఆపుకుని నడకను జోరు చేసింది. "పేరు చెప్పినంతమాత్రాన మీ నోటిముత్యాలు రాలిపోతాయా! మీ పేరు ఏమిటో కొంచెం చెప్పకూడదూ!" అతను తిరిగి అన్నాడు.

సరోజకు అవన్నీ ఏవిధంగా వదిలించుకోవాలో అర్థంకాలేదు. తలవంచుకొని మౌనంగా నడచిపోతోంది. "మీకోసం రోజూ శ్రమపడి వస్తున్నందుకైనా జాలి కలగాలి" అతని ధోరణిలో మార్పులేదు. ఎవరు రమ్మన్నారు? దానికి తను బాధ్యురాలు కాదు. పైగా రోజూ తనవెంటబడుతూ ఇతను పెద్ద సమస్యగా తయారయ్యాడు. "మీ పేరు చెప్పండి వెళ్ళిపోతాను. తెలుసుకోవాలని ఎంతో కుతూహలంగా వుంది."

సరోజకు ఇహ కోపం ఆగలేదు. టక్కున ఆగుతూ అంది "నా పేరు తెలుసుకొని ఏం చేస్తారు?"

అతను వులిక్కిపడ్డాడు. వణుకుతున్న స్వరంతో 'ఆరాధిస్తాను' అన్నాడు.

"అఘోరించలేక పోయారు. ఆరాధించటానికి మీకూ నాకూ ఏం సంబంధంవుందని. ఎందుకు నన్నిట్లా రోజూ వెంబడించి పీడించటం." ఆమె మాటల్లో మెరుపులే కాదు, ఉరుములుకూడా వున్నాయి.

అతని ముఖ మీద చిత్రమైన వికృతమందహాసం వెలసింది. అపహాస్యంగా సిగ్గుపడుతూ 'ప్రేమి.....స్తున్నాను' అన్నాడు.

సరోజముఖంమీద వ్యంగ్యభావం తొంగిచూసింది. గొంతుకను మార్దవంగా మార్చాలని ప్రయత్నంచేస్తూ "ప్రేమిస్తున్నారా!" అంది. ఇంతకాలంనుంచీ తెలుసుకోలేకపోయాను చూశారు! మరి ఈ మాట ముందే చెప్పేస్తే పోయేదిగా! ఐతే మీ పేరేమిటండీ?

అతని ముఖం క్షణంలో బెలూన్ లా ఉబ్బిపోయింది. గగనకుసుమం తన చేతిలో యిమిడినంత మహానందం కలిగింది. తొందరగా జవాబిచ్చాడు 'నా పేరు ఉజ్వల ఉల్లాసకర ఉమామహేశ్వర సచ్చిదానంద శర్మ.'

సరోజ ఒక నిట్టూర్పు విడిచింది. ఎంత సామాన్యంగావుంది మీపేరు. ఆ! మీరు నన్ను ప్రేమించానంటున్నారు కదూ?.

"ఉపద్రవంగా" అన్నాడు అతను.

"ఎటువంటి పరిస్థితుల్లోకూడా దానికి చలనం లేదనేగా మీ భావం" సరోజ కొంటెగా చూస్తూ అంది.

"మీరు నన్ను పరీక్షిస్తున్నారా! హృదయం చీల్చిచూపించమంటారా?" అతను ఒక తీవ్రమైన వుద్రేకంతో అన్నాడు.

"ఒద్దు! రక్తపాతమంటే నాకు యిష్టం వుండదు. అయినా నాది షైలాక్ ప్రవృత్తి అనుకుంటున్నారా యేమిటి? సరే మీరు

నన్ను ప్రేమిస్తున్నట్టుగా ఏ ఆధారాలతో నమ్మటం చెప్పండి? సరోజ సూటిగఅడిగింది.


అతను తడుముకోకుండా జవాబిచ్చాడు "ఆధారాలు అనేకం చూపించగలను. ఈ గడ్డంమీద తెగినమచ్చను చూశారా! ఇది Latest Example నిన్న మిమ్మల్ని ఊహించుకొంటూ గెడ్డం చేసుకోవటంలో జరిగిన అతిఘోర ప్రమాదం! ఇంకా పచ్చి తనంకూడా పోలేదు. కావలిస్తే గమనించండి అంటూ ఆ తెగినదానిమీద తడుము కొని 'అబ్బా' అన్నాడు.

"మీ ప్రేమకు ఆధారం ఇదేనా?" అడిగింది సరోజ.

"వద్దులెండి, ఇవి చాలు. కాని మిమ్మ లనుచూస్తోంటే జాలివేస్తోంది. ఎప్పుడయినా మీ మొహాన్ని అద్దంలో చూసుకున్నారా?"

"ఏమిటలా అంటున్నారు. అద్దంలేకుండా కాలక్షేపం చేస్తున్నాననుకున్నారా? అంత గతి కడుక్కుపోయిమాత్రంలేదులెండి" అతని మాటల్లో నిష్ఠురత గోచరించింది.

సరోజ వచ్చేనవ్వును ఆపుకొని అన్నది "అదికాదు మహాశయా! దేనికైనా అర్హత ఉండాలి. మీఅద్దంచెప్పిన సత్యాన్ని మీరు పాటించినట్లంటే నన్నిట్లా వెంబడించి వేధించుకు తినేవారు కాదు. ప్రేమించటమంటే వేలాలువేయించటమనుకుంటున్నారా!"



"ఎంతమాట! ఇది అనంతంలో అణు మాత్రమైన కారణం. ఇటువంటివి లక్షోప లక్షలు. నా రూమ్‌మేటు నన్ను నాలుగు సార్లు కొట్టాడు. ఎందుకో తెలుసా? అర్ధ రాత్రి నిశ్శబ్ద విభావరిని గమనిస్తూ మీ రూపాన్ని నా నయనాలముందు ప్రత్యక్షం చేసుకొని ఈ వెధవ కుడికాలువుంది చూశారూ వాడిమీద వేశానట. దాంతో దయలేకుండా శిక్షించాడు. ఇంకా చెప్పమంటారా?"

"అంటే నా మొహం బావుండదనేగా. మీ అభ్యంతరం! ఏంచేయమంటారు! ఆ బ్రహ్మ ఇలా సృష్టించాడు. అతన్ని తిట్టండి. ఇందులో నాతప్పేముంది. అక్కడికీ బజారు లోని ఆయింటుమెంట్సు అన్నీ వాడాను. లాభంలేకపోయింది. నిరాశచెందిపోయాను.

అతను జాలిగా చూశాడు.

అది సందుకావటం మూలంగా వీళ్ళిద్దరు ప్రపంచంబారినుంచి కొంతవరకూ రక్షింపబడ్డారు. అయినా ఒకళ్ళిద్దరు వీళ్ళిద్దర్నీ చూసి ముసిముసినవ్వులు నవ్వుకొంటూ వెళ్ళిపోయారుకూడాను. సరోజకు వచ్చినంత సిగ్గుగా వుంది. ఇవాళిటితో ఇతని విషయం తేల్చుకోవాలన్న నిశ్చయమే ఆమె నింతవరకూ ఆపివుంచింది. మాట్లాడుతున్నదేకాని ఎట్లా ఇతన్ని శాశ్వతంగా వదిలించుకోవటం అని పరిపరివిధాలుగా ఆలోచిస్తూవుంది. ఇంతలో ఆమెకు మెరుపులా ఓ ఆలోచన తట్టింది. "ఆధునిక దుష్యంతుల విషయంలో ఏమరి ఉండకూడదు" అన్న పంతులమ్మ గారిమాటలు కూడా లీలగా ఆమె హృదయాన్ని తట్టిపోతున్నాయి.

చివరికి స్వరాన్ని బహుదీనంగా మారుస్తూ ఒక పాడిదగ్గుదగ్గి అంది "మిమ్మల్ని ప్రేమించటానికి నాకేమీ అభ్యంతరంలేదు. కానీ నాలో ఒక లోపంవుంది. దాన్ని మీదగ్గర దాచివుంచలేను. అది మీరు వింటే నన్ను ప్రేమించినందుకు తప్పకుండా పశ్చాత్తాప పడతారు."

"ఏమిటాలోపం చెప్పండి. ఎటువంటి లోపాలైనా ఈ ప్రేమహృదయం భరించగలదు. సంశయించకండి" అతను తొందర చేస్తున్నట్టుగా అన్నాడు.

సరోజ మళ్ళీ దగ్గి అంది "మీ ముందు నేను నోటితో చెప్పలేను. చీటిమీద వ్రాసి ఇస్తాను. నేను వెళ్ళినతర్వాత చూసుకోండి" అంటూ నోటులోంచి కాగితంచింపి దాని మీద ఏమిటో వ్రాసి మడతపెట్టి అందించింది.

అతను బహువినయంగా ఆ కాగితం నుదతను స్వీకరించాడు. సరోజ చిన్నగాదగ్గుతూ వెళ్ళిపోయింది. అతను ఆమెను కనుమరుగయ్యేవరకూ చూసి కాగితం విప్పాడు. అతనిగుండె దడదడలాడింది. చేతులు వణుకుతున్నాయి. మళ్ళీ కాగితంలోని మాటలు ఒకసారి చదివాడు. "నాకు క్షయ జబ్బు ఉంది. ఎంతోకాలం బ్రతకను" పొరపాటు చేశానని అతని హృదయం పశ్చాత్తాపపడింది. కాగితం అనివార్యంగా అతని చేతుల్లోంచి జారి విముక్తిపొందిన బందీలా గాలిలో ఎగిరి పోయింది. అతను మసకచీకటిలో ముహాన్ని దాచుకుంటూ వెళ్లిపోయాడు. సరోజ అతన్ని తర్వాత చూడలేకపోయింది. భూమి ధర్మం తెలియని గాలిమేడలు ఎలా కూలిపోతాయో ఆమెకు బాగా తెలిసివచ్చింది. గాలికి పగిలే గాలిబుడగలనుంచి చిరమధురమైన ఆంతర్య శోభను ఆశించటం వ్యర్థమేకాదు. దుఃఖిత స్వరాలతో జీవితం గడపాల్సి ఉంటుంది జాగ్రత! అంటుంది సరోజ.